నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | మార్చి 13, 2024 | www.navatelangana.com

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు

హాజీపూర్ : మండలంలోని గుడిపేట మౌంట్ కార్మెల్ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఇటీవల మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మౌంట్ కార్మెల్ పాఠశాల ప్రిన్సిపాల్ అల్ఫి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, కేజీబీవీ జిల్లా అధికారి యశోధర, జిల్లా కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ఏఎస్ఓ రాజకుమార్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి కస్తూర్బా బాలికల విద్యాలయం కర్ణమామిడికి చెందిన లక్ష్మీప్రసన్న, ద్వితీయ బహుమతి రాంపూర్ విద్యారణ్య ఆవాస విద్యాలయం విద్యార్థిని అశ్విని, తృతీయ బహుమతి మౌంట్ కార్మెల్ హైస్కూల్ గుడిపేట్ విద్యార్థిని హర్షిత, జడ్పీహెచ్ఎస్ ముల్కల్ల స్కూల్ టాపర్‌గా నిలిచిన అర్చనకు బహుమతులు అందజేశారు.



కరెంట్ షాక్‌తో వృద్ధుడు మృతి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కౌట(కె) గ్రామానికి చెందిన కేంద్రే విఠల్(66) షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్ వేస్తుండగా ఒకేసారి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంట్లోనే ఉన్న తల్లి యశోదబాయి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. అంతలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.



బయోమెట్రిక్ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత
- కలెక్టరేట్ల ఎదుట అంగన్వాడీల ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ కేంద్రాలలో సిసి కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత అన్నారు. మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుండి ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పని చేయని సెల్ ఫోన్‌లు మాకొద్దు అంటూ రోడ్డుపైనే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు ఒకపూట బడితో పాటు మే నెలంతా టీచర్స్, హెల్పర్స్‌కు సెలవులివ్వాలని డిమాండ్ చేశారు. తమకిచ్చిన పనిచేయని సెల్ ఫోన్‌లను తిరిగి అప్పగిస్తున్నామని అన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఐసిడిఎస్ శాఖపై నిర్వహించిన సమీక్షలో శాఖకు బడ్జెట్ పెంచి, ఎలా బలోపేతం చేయాలనే అంశాలు చర్చించలేదన్నారు. 48 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం కోసం తీసుకునే చర్యలపై చర్చించకుండా పేద ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అవినీతిపరులని ఆరోపించడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో కుటుంబ సర్వే చేయాలని అధికారులు చెప్తున్నారని, ఈ పనికి ఆటంకంగా ఉన్న అంశాలు పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సునీత, జిల్లా నాయకులు మధునిక, కవిత, పార్వతి, సుభద్ర, రత్నమాల, పుషవర్త, ముక్తా, మల్లికాంబ, కళావతి, విఠాబాయి, అనిత, భీంబాయ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



ఆసిఫాబాద్‌లో ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీలు

ఆసిఫాబాద్ : అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, బయోమెట్రిక్ లాంటి నిర్ణయాలు వెంటనే విరమించుకోవాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.త్రివేణి డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం డిడబ్ల్యూఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ కేంద్రాలలో సిసి కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు ఒకపూట బడితో పాటు మే నెలంతా టీచర్స్, హెల్పర్స్‌కి సెలవులివ్వాలని, పనిచేయని సెల్ ఫోన్లు తిరిగి తీసుకొని కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని, 24రోజుల సమ్మె హామీలు అమలు చేయాలని కోరారు. పదవి విరమణ బెనిఫిట్స్ పెంచుతామని, 2వ పిఆర్సిలో 5శాతం ఐఆర్, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ జిఓ ఇస్తామని, సమ్మెకాలపు వేతనాలు, ప్రమాద బీమా, టిఎ, డిఎలు, మే నెల సెలవులు, ఆన్‌లైన్ ఒకే యాప్ ఉండే విధంగా చూస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని లేదంటే అంగన్వాడీ పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గంగామణి, వర్కింగ్ ప్రెసిడెంట్ వనిత, జిల్లా నాయకులు వినోద, ధనలక్ష్మి, రాజేశ్వరీ, చంద్రకళ, కమల, తార, మంజుల, పార్వతి, కుమారి, హైమావతి, ఉమాదేవి, మల్లీశ్వరి, స్వప్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, కార్యదర్శి ముంజం శ్రీనివాస్, కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్లు అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాపై వచ్చిన అన్ని ఫిర్యాదులను విచారణ జరిపి ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను ముందే గుర్తించాలని, పార్లమెంటు ఎన్నికల్లో హోమ్ ఓటింగ్ ప్రక్రియ సక్రమ నిర్వహణకు సరైన ప్రణాళిక ముందు నుంచి సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ విషయంలో ఎలాంటి తప్పులు చేయవద్దన్నారు. పోలింగ్ రోజు రికార్డింగ్ కోసం సరైన వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతేకాక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో బాగంగా అవసరమైన వీడియో సర్వేలెన్సు, వీడియో వీక్షణ తదితర పనుల కోసం అవసరమైన కెమెరాలను ముందే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించి ఎన్నికల సంఘానికి పంపించే బాధ్యతను జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను బాగా తీర్చిదిద్దారని, అదేవిధంగా పార్లమెంటు ఎన్నికలలో సైతం మంచి మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, మోడల్ పోలింగ్ కేంద్రాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆర్ఓ కార్యాలయంతో పాటు, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఈనెల 13 లోగా పంపించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డేటా అప్లోషన్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. అడిషనల్ సీఈవో లోకేష్, సర్ఫరాజ్ అహ్మద్‌లు మాట్లాడుతూ ఓటరు జాబితా, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు, వివిధ రకాల నోడల్ టీములకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాలు, ఎన్నికలు వెలువడిన తర్వాత ప్రతిరోజు సమర్పించే నివేదికలు, పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే మీడియా సమావేశం, పొలిటికల్ పార్టీలకు సమాచారం, డీ ఫేస్‌మెంట్, అనుమతులు, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సెక్టోరల్ అధికారుల నియామకం, హోమ్ ఓటింగ్, నామినేషన్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ వికాస్ మోహతో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన పన్నులు వసూలు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో పన్నుల వసూలు త్వరిత గతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలలో పన్నుల బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. బకాయిలు ఉన్న పన్నులు కట్టని వారికి నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులకు స్పందించని వారి ఆస్తులు జప్తు చేయడానికి వెనకాడొద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పన్నుల వసూలులో అలసత్వం వహించిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేస్తమని తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో నిర్మల్ మున్సిపల్ కమిషనర్ రాజు, భైంసా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఆర్ఐలు, బిల్ కలెక్టర్‌లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



నవతెలంగాణ-తాంసి

విద్యార్థులు కష్టపడి చదివితేనే ఏదైనా సాధ్యమవుతుందని డీఎస్పీ జీవన్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం కప్పర్ల జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో విద్యార్థులకు పదో తరగతి ఉత్తీర్ణత, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. హైస్కూల్‌కు విచ్చేసిన డీఎస్పీని గ్రామ ప్రముఖులు పాఠశాల సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలంటే కష్టపడి ఇష్టంతో చదువుకున్నప్పుడు మంచి ఫలితాలు సాధిస్తామని అన్నారు. రాబోయే పై చదువులకు ఒక మెట్టుగా ఉంటుందన్నారు. కష్టపడి చదివినప్పుడు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహిస్తామని అన్నారు. ముఖ్యంగా పరీక్షలు అయ్యేంతవరకు సెల్ ఫోన్లు టీవీలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదానందం, ఎంపీటీసీ సంతోష్, మాజీ ఎంపీటీసీ మహేందర్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నార్నూర్

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ రహీమ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మహిళ సాధికారత సదస్సులో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే వివిధ నేరాలను, ప్రత్యేకమైన హక్కులు, చట్టాలను వివరించారు. అవగాహన సదస్సులో ఎస్ఐ రవికిరణ్, ప్రిన్సిపాల్ చినప్పారెడ్డి ఉన్నారు.

జోడు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని

సీపీఐ(ఎం) పాదయాత్ర

- ప్రజా సంఘాల మద్దతు

నవతెలంగాణ-జైపూర్

భీమారం-కిష్టపేట్ మధ్య జాతీయ రహదారి జోడు వాగు వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. శిథిలావస్థలో గల జోడువాగుపై వంతెన, ఇరువైపులా రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. దీనికి ప్రజా సంఘాలు మద్దతుగా నిలిచాయి. జోడు వాగు నుండి భీమారం మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంకె రవి మాట్లాడుతూ చెడిపోయిన రోడ్డుతో పాటు ఇరుకైన వంతెన కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అయినా ప్రభుత్వాలు నిద్రావస్థలో ఉన్నాయని విమర్శించారు. ఇందారం ఎక్స్ రోడ్డు నుండి సిరొంచ సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన మధూకాన్ కంపెనీ యాజమాన్యం నిర్మాణ పనులను 8 సంవత్సరాల నుండి సాగదీస్తుందని ఆరోపించారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తుండటంతో పాటు చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. అదేవిధంగా భీమారం మండల కేంద్రంతో పాటు జైపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జోడువాగు వంతెన నిర్మాణం పట్ల ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని, ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో గాయపడిన వారితో పాటు మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాసిరకంగా నిర్వహించిన పనులు గుర్తించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు దాసరి రాజేశ్వరి, బోడంకి చందు, ఉమారాణి, సమ్మక్క, చంద్రన్న, నాగేష్, కావిరి రవి, దుంపల రంజిత్, గోమాస ప్రకాష్, దూలం శ్రీనివాస్, దేవి సత్యం, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు సిద్ధార్థ, సమతా సైనిక్ దళ్, ఐద్వా నాయకులు నిర్మల, నాగజ్యోతి, యామిని, సరిత, ఎస్ఎఫ్ఐ శ్రీకాంత్, అభినవ్, అరవింద్‌రెడ్డి, డీవైఎఫ్ఐ అనిల్, కేవీపీఎస్ మోహన్, కుమార్, అశ్విని, మధు, గిరిజన సంఘం సమ్మక్క, భూదక్క, గావిడి సరిత, సుజాత, కళాకారుల సంఘం రమాదేవి, రాజేశ్వరి, రైతు సంఘం రాజన్న, బొందయ్య, వెంకటస్వామి, మధునక్క, సునిత పాల్గొన్నారు.



ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూముల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ స్థలాలు, ప్రాజెక్టులు, కాలువలు, చెరువుల శిఖం భూముల సరిహద్దులను గుర్తించి ఆక్రమణకు గురికాకుండా రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థలాలు, శిఖం భూముల ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా భూములు, స్థలాలపై చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నాకళ్యాణి, కలెక్టరేట్ పర్యవేక్షకులు అతికొద్దీన్, రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలి



నవతెలంగాణ-మందమర్రి

కాంట్రాక్టు కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని ఎస్‌సికెఎస్(సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సివిక్ కార్మికుల ఆధ్వర్యంలో కార్మికుల పని సమయాలను మార్చాలని, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఎండల దృష్ట్యా సింగరేణిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఎండలకు డిహైడ్రేషన్ బారిన పడకుండా ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను అందించాలన్నారు. పని ప్రదేశాలలో చల్లని మంచినీరు అందించాలని, పని సమయాలు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు మార్చాలని కోరారు. కార్యక్రమంలో సురేందర్, తిరుపతి, రమేష్, సది, చంటి, రాయమల్లు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నుండి ఆత్రం నగేష్ బహిష్కరణ

- నూతన కన్వీనర్‌గా అగ్గిమల్ల సాయిచరణ్ ఎన్నిక
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇప్పటి వరకు ఉన్న జిల్లా కమిటీని రద్దు చేసి, జిల్లా కార్యదర్శిగా పనిచేసిన ఆత్రం నగేష్ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఎస్ఎఫ్ఐ నుండి బహిష్కరిస్తున్నామని రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. ఇక నుండి ఆత్రం నగేష్‌కు ఎస్ఎఫ్ఐకి ఎలాంటి సంబధం లేదని, విద్యాసంస్థల యాజమాన్యం, అధికారులు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం విద్యను కషాయీకరణ చేస్తే ప్రయత్నం చేస్తోందన్నారు. అందుకే నూతన జాతీయ విద్యావిధానం తీసుకొస్తోందని తెలిపారు. తెలంగాణలో ఏర్పడ్డ నూతన ప్రజా ప్రభుత్వం పేరుకు ప్రజా ప్రభుత్వం తప్ప ఆచరణ మాత్రం విద్యారంగంకి మొండి చెయ్యి చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడంతో విద్యారంగ సమస్యలను ఎవ్వరికి విన్నవించుకోవాలో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.7వేల కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివశంకర్, వినోద్, బన్నీ, భీంరావ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్‌గా అగ్గిమల్ల సాయిచరణ్, కో కన్వీనర్‌లుగా కోట్నక్ సక్కు, ఎస్‌కె.సమీర్, కుమ్ర భీంరావ్, కమిటీ సభ్యులుగా పొలపక బన్నీ, మగ్గిడి శివశంకర్, కురెల్లి వినోద్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేశారు.

విలేకరిపై దాడికి ఖండన

రామకృష్ణాపూర్ : ప్రెస్‌క్లబ్‌లో చొరబడి పత్రిక విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడాన్ని ఐఎఫ్టీయూ జిల్లా సహాయక కార్యదర్శి బి గోపీనాథ్ ఖండిచారు. మంగళవారం చెన్నూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో రాత్రి చొరబడి ప్రజాజ్యోతి విలేకరి వెంకటేష్‌పై గుర్తుతెలియని ఇద్దరు గూండాలు దాడికి పాల్పడడం అప్రజాస్వామిక చర్య అన్నారు. దాడి వెనుక ఎమ్మెల్యే గడ్డం వివేక్ హస్తం ఉందని ఆరోపించారు. విలేకరిపై దాడికి పాల్పడిన వారిపై, దాడి చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | మార్చి 13, 2024 | www.navatelangana.com

ఫ్రెండ్స్ క్లబ్ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ అవరణలో మంగళవారం నూతన భవన నిర్మాణానికి జెడ్పీటీసీ సంధ్యారాణి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ తమ నిధుల తో రూ.10లక్షలు మంజూరు చేసి, నిర్మించడం జరుగుతుందన్నారు. అలాగే కొన్ని దశాబ్దాల చరిత్ర కలిగిన ఫ్రెండ్ క్లబ్ భవన నిర్మాణానికి ఈరోజు భూమిపూజ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. అలాగే యువతకు, విద్యావంతులకు, ఉద్యోగులకు ఫ్రెండ్స్ క్లబ్ ఒక వేదికగా ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తహేర్ బిన్ సలాం, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎలక రాజు, నాయకులు రఫీ, షేకన్న, ఫ్రెండ్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, ఫ్రెండ్స్. క్లబ్ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రసాద్, ఆప్కా కిషన్ పాల్గొన్నారు.



ఉత్తమ మహిళా సర్పంచ్‌కు సన్మానం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన శ్రీవిద్య ఉత్తమ మహిళా సర్పంచ్‌గా ఎంపికై సన్మానం పొందారు. గ్రామానికి ఉత్తమ సేవలు అందిస్తూ, ఆదర్శంగా నిలిచిన తాజా మాజీ సర్పంచ్ శ్రీవిద్యను పలువురు అభినందించారు. అదేవిధంగా బాబాపూర్ గ్రామానికి చెందిన కాషామ్మా అనే మహిళా ఆటో నడుపుతూ స్వయం కృషితో ఎందరికి ఆదర్శంగా నిలుస్తుంది. కాషామ్మాను అధికారులు ఘనంగా సన్మానించారు.



సీఎం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల ధర్నా



నవతెలంగాణ-నిర్మల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని మార్చి 2న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశించడం అనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. మంగళవారం తెలంగాణ అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికహారం దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దీని కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని అధికారులను ఆదేశించడం అంటే అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ దొంగలుగా చిత్రీకరించడమేనని అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి ఎలా బలోపేతం చేయాలని అంశాలు సమావేశంలో చర్చించడం లేదన్నారు. 48 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం కోసం తీసుకున్న చర్యలు సమావేశంలో చర్చించలేదని అన్నారు. వీటన్నిటిని పక్కనపెట్టి పేద ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లను అవినీతిపరులుగా చూడటం ఏ మేరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణ వెనక్కి తీసుకోవాలని అన్నారు. గత 24 రోజుల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ ఉద్యోగులు మిగిలిన సమస్యలతో పాటు వేసవికాలంలో ప్రభుత్వ పాఠశాలలో పాటు సమానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఒకపూట బడితో పాటు మే నెల అంతా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఇద్దరికీ ఒకేసారి సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ కుటుంబ సర్వే చేయాలని అధికారులు చెబుతున్నారని అన్నారు. పనికి ఆటంకంగా ఉన్న అంశాలు పరిశీలించాలని కోరుతున్నామని అన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు ఇచ్చి చాలా సంవత్సరాలు అవుతుందని అవి పని చేయడం లేదని అన్నారు. 24 గంటలు ఆన్‌లైన్ పని, చిన్న ఫోన్‌లో చేయడం వల్ల కంటి సమస్యలు పెరిగి కండ్లు కనపడకుండా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, కోశాధికారి శైలజ, ఉపాధ్యక్షులు గంగామణి, విజయ, జిల్లా నాయకులు భాగ్యలక్ష్మి, పద్మ, వర్ధమాల, స్వరూప, విజయలక్ష్మి, గంగామణి, రాజమణి, వందన, తులసమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సెస్సీ టాలెంట్ టెస్ట్ విజేతలకు మంగళవారం బహుమతులను ఆయా పాఠశాలలకు వెళ్లి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా టీఏవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉయిక విష్ణు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయం పోగొట్టి వారిని పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా కృషి చేసేందుకు టాలెంట్ టెస్ట్ పెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మెస్రం మహేష్, ఏటీడీఓ నిహారిక, హెచ్ఎం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విజేత పాఠశాల ప్రిన్సిపల్ రజిత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విజేత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఫేర్వెల్ పార్టీ అనేది విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఈ పాఠశాలను విడిచి కళాశాలకు వెళ్తున్నందున వారికి వీడ్కోలు పలికే గొప్ప సన్నివేశమని పేర్కొన్నారు. పాఠశాలను విడిచి వెళ్లిన విద్యార్థులు పై చదువులు శ్రద్ధ, ఆసక్తితో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుఖేష్, సతీష్, నవీన్, రాజశేఖర్, చంద్రకళ, నాగమణి, సుష్మిత, ప్రతిభ, సుమలత, నిఖిల, శరణ్య, విజయశ్రీ, నిఖిల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, అభివృద్ధి చెందాలని జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి సబిత సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి కళ్యాణ మండప ఆవరణలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జన శిక్షణ సంస్థ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కార్యక్రమాలు నేర్చుకుంటున్న 300 మంది మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వృత్తి నైపుణ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థ జిల్లాలో అనేక కోర్సుల్లో వృత్తి శిక్షణ కార్యక్రమాలు ఉచితంగా అందిస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తుందని అభినందించారు. అనంతరం జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటువంటి వృత్తి శిక్షణ కార్యక్రమాలు తీసుకొని ఇంట్లోనే ఉంటూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. నేర్చుకున్న శిక్షణను కొనసాగించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తి గీతాలు పలువురుని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషణ్ రాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, సెడ్స్ ఎన్జీఓ డైరెక్టర్ ఆర్ సురేందర్, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.శ్యామల, రాజన్న పాల్గొన్నారు.

మెరుగైన వైద్యాన్ని అందించాలి

- బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఉట్నూర్

హైదరాబాద్ పట్టణంలోని సోమాజిగూడల యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముంజం మల్లేష్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం రాత్రి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఆర్థికంగా రోగికి ఇబ్బందులకు గురి చేయోదన్నారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సాయాన్ని తనవంతుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శనగ కొనుగోళ్లు ప్రారంభం

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో మంగళవారం సహకార సంఘం సొసైటీ నాఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోళ్లను సొసైటీ వైస్ చైర్మెన్ ధనుంజయ్ సీఈఓలతో కలిసి ప్రారంభించారు. మొదటగా రైతులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఈఓ కేశవ్ మాట్లాడుతూ తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన రైతులు పండించిన, శనగ పంటలను క్వింటాలుకు రూ.5,440 మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు ప్రయివేటు దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దన్నారు. గ్రామాల వారీగా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బుజ్జన్న, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, జామిడి సొసైటీ సీఈఓ రాంరెడ్డి, ఏఈఓ యోగిరాజ్ ఉన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తిని తన ఛాంబర్‌లో కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితులపై మాట్లాడారు.

జీరో బిల్లులు రాక పరేషాన్



నవతెలంగాణ-ఉట్నూర్

ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. అరులైన వారికి ప్రతినెల 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఇందులో భాగంగా ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు తమ ఆధార్, రేషన్ కార్డ్, కరెంట్ మీటర్ నెంబర్, ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా విద్యుత్ అధికారులు సిబ్బంది, గ్రామాల్లో ఇంటింటి తిరిగి వివరాలను నమోదు చేసుకున్నారు. ఆ వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గృహజ్యోతి పథకంలో భాగంగా మార్చి ఒకటి నుంచి ఆన్‌లైన్ అయినా వారికి ఉచితంగా కరెంటు అందజేస్తామని అన్నారు. ఇందులో భాగంగా జీరో బిల్లుల పంపిణీ కొందరికి అందించామని విద్యుత్‌శాఖ అధికారి (ఏఈ) అన్నారు. ఆన్‌లైన్ చేయనివారు ఎంపీడీఓ కార్యాలయంలో జీరో బిల్లులు రాక పరేషాన్ అవుతున్నారు. ప్రజలు హడావుడిగా కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్ నమోదు కోసం క్యూలైన్లో వేచి ఉంటున్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద బారులు తిరుగుతుండటంతో రద్దీ నెలకొంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు ఉండటంతో జీరో బిల్లులు రావడం లేదని అధికారులు అంటున్నారు. మీటర్ నెంబర్ తప్పుగా రాయడం, వినియోగదారులు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, లేకపోవడం, 200 యూనిట్లకు పైగా విద్యుత్‌ను వినియోగించడం వల్ల జీరో బిల్లులు రావడం లేదని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. అర్హులైన వారందరికీ బిల్లులు వస్తాయని, పూర్తి వివరాలతో ఎంపీడీఓ కార్యాలయంలో వినియోగదారులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

త్రీఫేజ్ ఉచిత కరెంట్ సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ రైతులకు వ్యవసాయానికి త్రీఫేజ్ ఉచిత కరెంట్ సౌకర్యం కల్పించాలని, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు అన్నారు. బోథ్ మండలం పాట్నాపూర్ గ్రామ ఆదివాసీ నాయకులు, ప్రజలు మంగళవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ ఏఓ రాంబాబును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పుర్క బాపురావు మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా ఆదివాసీ రైతులకు వ్యవసాయం కోసం త్రీఫెజ్ ఉచిత సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ పంద్రం శంకర్, తొడసం గోపాల్‌తో పాటు 23 మంది పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన వేదం పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని వేదం పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ప్రతిభా కనబర్చారని ఉపాధ్యాయులు సంతోష్ అన్నారు. వేదం పాఠశాలలోని జనవరి 27న సీవీ రామన్ ఒలంపియార్డ్ నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే టాలెంట్ టెస్టులో నాలుగో తరగతి విద్యార్థి ధనుష్, ఏడో తరగతి విద్యార్థి నర్సింహ, టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలోని నిలిచారని అన్నారు. సీవీ రామన్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

రంజాన్ మాసం ప్రారంభం

నవతెలంగాణ-ఉట్నూర్

ఆకాశంలో నెలవంక కనిపించడంతో ఉపవాస దీక్షలు ప్రారంభిస్తున్న ముస్లిములందరికీ రంజాన్ మాసం నెలవంక శుభాకాంక్షలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నెల రోజుల పాటు ఉండే రంజాన్ ఉపవాస దీక్షలను అత్యంత పవిత్రంగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని తెలియజేశారు.

బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

అనారోగ్యంతో కొన్ని రోజుల నుంచి బాధపడుతున్న యశ్వంత్‌రావుకి లంబాడి జేఏసీ ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ పరామర్శించారు. మంగళవారం ఆదిలాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితున్ని పరామర్శించి, ధైర్యానిచ్చారు. ఈ కార్యక్రమంలో లంబాడి జేఏసీ నాయకులు జాదవ్ గోపాల్‌రావు, ఎంపీటీసీ, రాథోడ్ సురేష్ నాయక్, గోవర్ధన్, విజయ్ కుమార్ ఉన్నారు.

ఆదిలాబాద్‌లో వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్ ప్రారంభం

- వర్చువల్‌తో ప్రారంభించిన దేశ ప్రధాని
- ఇక మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రైల్వే స్టేషన్లలో వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్ పథకానికి శ్రీకారం చుట్టారని సీనియర్ డివిజనల్ పర్యవరణ, హోమ్‌కిపింగ్ మేనేజర్ రాంచంద్ర సాహు అన్నారు. మంగళవారం గుజారాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రధాన మంత్రి దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో సౌకర్యాల కల్పనకు వర్చువల్ ద్వారా పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్ దుకాణాన్ని రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజన్ పర్యావరణ, హోమ్ కిపింగ్ మేనేజర్ రాంచంద్ర సాహు మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లోని ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్ పథకాన్ని ప్రారంభించారు. ప్రతి రైల్వే స్టేషన్‌లో ఈ దుకాణాలను ఏర్పాటు చేసి ఆ ప్రాంతాల వంటకాలు, తిను బండారాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రయాణికులకు మంచి రుచికరమైన పదార్థాలు అందుతాయని తెలిపారు. అదే విధంగా రైల్వే స్టేషన్‌ల అభివృద్ధికి కృషి చేస్తు రూ.వేల కోట్ల నిధులను కేంద్రం అందిస్తుందన్నారు.

పది కోట్లతో స్టేషన్‌లో సౌకర్యాలు...

ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ఎంపీ సోయం బాపురావ్ నేతృత్వంలో రైల్వేమంత్రి దృష్టికి తీసుకెళ్తానని రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ తెలిపారు. ఇప్పటికే రూ.పది కోట్లతో వీఐపీ లంచ్, కుర్చీలు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి వర్చువల్ ద్వారా రూ.85 వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారని తెలిపారు. ఇందులో ఆదిలాబాద్ రైల్వేస్టేషన్లో వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్ దుకాణం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీఎస్పీ జీవన్ రెడ్డి, అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ శంకర్, ధర్మాజీ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 503 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ సెకండ్ ఈయర్ (ఫిజిక్స్, ఎకనామిక్స్) వార్షిక పరీక్ష జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. కాగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,420 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 8,917 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ కుమార్ వెల్లడించారు. 503 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాదిగ జేఏసీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజర్షిషాను కలెక్టరేట్ కార్యాలయంలో మాదిగ జేఏసీ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటం అందజేశారు. మాదిగ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బారిక్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నక్క రాందాస్, సిబ్బంది ఉన్నారు.

విద్యుద్ఘాతంతో ఆవు మృత్యువాత

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని ఉమ్రి గ్రామంలో విద్యుద్ఘాతానికి గురై ఆవు మృత్యువాత పడింది. బాధితుడు జాదవ్ హిరాలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆవుకు రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం మేతకు చేనులోకి వెళ్లింది. మేత మేస్తూ, అక్కడే ఉన్న వైర్లు తగలడంతో ఆవు అక్కడిక్కడే మృతి చెందింది. ఆవు ధర రూ.20వేలపైన ఉంటుందని తెలిపారు. అదికారులు తక్షణమే స్పందించి, నష్టపరిహారం అందించాలని కోరారు.

క్రీడా పాఠశాల చివరి దశ ప్రవేశ ఎంపిక పోటీలు

నవతెలంగాణ- ఆసిఫాబాద్

వచ్చే విద్యా సంవత్సరం 2024-25 కు గాను ఆసిఫాబాద్ పట్టణంలో గల గిరిజన ఆదర్శ బాలికల క్రీడ పాఠశాలలో 5వ తరగతిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచి నైపుణ్యం గల క్రీడాకారిణిల కోసం ఈ నెల 15న చివరిదశ శారీరక సామర్థ్య ప్రవేశ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రే, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు ఆర్.రమాదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల పాఠశాల క్రీడ మైదానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతూ, 9సంవత్సరాల లోపు వయసు కలిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన విద్యార్థినీలు అర్హులని, ఇప్పటివరకు మొదటి దశ ఎంపిక పోటీలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఇతర వివరములకు జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డిని 9440010453 సంప్రదించాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ - బెజ్జూరు



మండలంలోని లంబడిగూడ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ నాయకులు సడ్మేక రమేష్, కుమురం అనంతరావు, గేడమ్ హనుమంతు, ఆత్రం గోవర్ధన్, ఆత్రం శ్యాంరావు మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో అగ్రగామిగా నిలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పల్లెకూ అభివృద్ధి ఫలాలు, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూస శంకర్, కాంగ్రెస్ మండల నాయకులు ఆత్రం రాజారామ్,సెండె బాబురావు పాల్గొన్నారు.

రైల్వేను విస్తృత పరిచేందుకు చర్యలు



నవతెలంగాణ - కాగజ్‌నగర్

దేశంలో రైల్వే వ్యవస్థను మరింత విస్తృతం చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ అన్నారు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ ఆవరణలో మంగళవారం వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ. 85 వేల కోట్ల రైల్వే పనులకు ప్రారంభోత్సవం నిర్వహించారు. మాకుడి - కాగజ్‌నగర్ మధ్య నూతనంగా నిర్మించిన రైల్వే 3వ లైనును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 3వ రైల్వే లైనుతో ఎక్కువ రైళ్లు నడపడానికి, రైళ్ల హాల్ట్ లకు అవకాశం ఏర్పడిందని, సమయపాలన కూడా కచ్చితంగా నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి, ఇతర రైల్వే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రైల్వే అధికారులను ఆదేశించారు. అనంతరం వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ పథకంలో కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ కు మంజూరైన కాజు స్టాల్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, పవన్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలివెళ్లిన ఐకేపీ ఉద్యోగులు



నవతెలంగాణ - సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం అమలుచేస్తున్న మహిళలకు వడ్డీలేని రుణాలను ప్రారంభిస్తున్నందున సిర్పూర్ మండల ఐకేపీ ఉద్యోగులు నేడు సికింద్రాబాద్‌లో జరిగే బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఐకేపీ ఉద్యోగులు, స్వశక్తి మహిళా గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఎంతగానో ఉపయోగపడుతుందని, దీంతో పేదరిక నిర్మూలన, ప్రతి ఒక మహిళా గ్రూప్ సభ్యులకు ఆర్థికంగా నిలదొక్కడానికి చేదోడువాదోడుగా ఉంటుందన్నారు. ఈరోజు జరిగే బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రూపుల సభ్యులు వెళ్తున్నట్టు, మహిళలు ఎంతో రుణపడి ఉంటారన్నారు. వీరి వెంట ఐకేపీ ఏపీఎం దుర్గయ్య, మహిళా సంఘాల గ్రూప్ సభ్యులు ఉన్నారు.

డీడబ్ల్యూఓకు శుభాకాంక్షలు



నవతెలంగాణ- ఆసిఫాబాద్

జిల్లా మహిళ, శిశు సంక్షేమాధికారిగా బాధ్యతలు స్వీకరించిన అడేపు భాస్కర్‌ను మంగళవారం పద్మశాలీ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలు సమస్యలను చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకల్ల అంజనేయులు, నాయకులు శ్రీనివాస్, లింగయ్య, ధర్మయ్య శైలేందర్, మోహన్, మధుకర్, జంజిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

సిర్పూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు గత ఆరు నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో తమ వేతనాలు చెల్లించాలని వైద్యురాలు అనూషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్టు ఉద్యోగులైన శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి ఏడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వడంలేదని, ఈపీఎఫ్ వివరాలు తెలియజేయాలని, చట్ట ప్రకారం ఇవ్వాల్సిన సెలవులు ఇవ్వాలని, కార్మికులు తమ కుటుంబాలను పోషించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కార్మికులు షరీఫ్, దినేష్, పుష్ప, రజిత, పద్మ పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకే ప్రత్యక్ష రాజకీయాల్లోకి

నవతెలంగాణ-కెరమెరి

ప్రజలకు నేరుగా సేవ చేసేందుకే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు సుగుణక్క అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, 20 ఏళ్లుగా ప్రజా ఉద్యమాల్లో కొనసాగుతున్నానని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేశానని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రశ్నించిన నేపథ్యంలో గత ప్రభుత్వం తనపై 56కేసులు పెట్టిందన్నారు. అదే స్ఫూర్తితో నేరుగా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బరిలో ఉంటానని తెలిపారు. మొట్ట మొదటి ఆదివాసి మహిళగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి బరిలో ఉంటానని చెప్పారు. పార్లమెంట్ పరిధిలోని ప్రజలు ఆదరించి మద్దతు ఇవ్వాలన్నారు. ఇక్కడి ప్రజలకు సమన్యాయం చేయడంలో బాధ్యతగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కనక వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాథోడ్ సుదర్శన్, సిడాం జగన్నాథ్‌రావు, కుతుబొద్దీన్, మారుతి, షేకురావ్, సిడాం నగేష్, విశ్వేశ్వర్ పాల్గొన్నారు.



జైనూర్ : దేశం అన్ని రంగంలో అభివృద్ధి చెందాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ టికెట్ ఆశావాహ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కొలాం, మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు ఎలాంటి సాయం చేయలేదని తెలిపారు. కొలాం గిరిజనులు అభివృద్ధి కావాలంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం నాయకులు ఆమెను శాలువాతో సన్మానించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బీఆర్ఎస్ నాయకుడు మెస్రం అంబాజీని పరామర్శించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు అజ్జులాల ఉన్నారు.

మిషన్ భగీరథ అధికారులపై ఆగ్రహం



నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సమావేశంలో మిషన్ భగీరథ అధికారులపై ఎంపీటీసీ ఈర్లె ప్రవీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ ముండె విమలాబాయి అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో గత ఐదు సంవత్సరాల నుండి మిషన్ భగీరథ పనులపై ప్రతి మండల సమావేశంలో ఎన్నిసార్లు అడిగిన అప్పుడు ఇప్పుడు అంటూ చెప్పడం తప్పితే పనులు ముందుకుసాగకపోవడం, పైపులైన్ లీకేజీలు మండలంలో పూర్తికావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పదవీకాలం పూర్తికావస్తున్నా పనులు మాత్రం పూర్తికావడంలేదని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు మిషన్ భగీరథపై అడుగుతున్నా సరైన సమాధానం చెప్పలేకపోతున్నామని, మండలంలో జరిగే కార్యక్రమాల్లో కూడా ప్రోటోకాల్ పాటించడంలేదని, తమను ఎక్కడికి కూడా పిలవడంలేదని ఆయన అన్నారు. మిషన్ భగీరథ జేఈ శైలేందర్‌పై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంఈఓ మనుకుమార్ మాట్లాడుతూ రాబోయే పదో తరగతి పరీక్షల కోసం మండలకేంద్రంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని, ఎలాంటి ఇబ్బందులు పడకుండా మంచిగా చదువుకొని పరీక్షకు సిద్ధం కావాలని ఆయన విద్యార్థులను కోరారు. వ్యవసాయ అధికారి మిలింద్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు పత్తి రైతులు తమ ఆధార్‌కార్డులను కార్యాలయంలో నమోదు చేసుకుంటేనే పత్తి అమ్మితే తమ ఖాతాలో జమకావడం జరుగుతుందని, చాలామంది రైతులు ఆధార్‌కార్డులు లేకపోవడం, ఇప్పటికైనా పత్తి రైతులు ఆధార్‌కార్డులు కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన కోరుతున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీవీ వరలక్ష్మీ అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపల్, అధ్యాపకుడికి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉత్తమ ప్రిన్సిపల్‌గా జిల్లా తరఫున అవార్డు పొందిన జైనూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉత్తమ అధ్యాపకుడు చంద్రయ్యని జిల్లా కేంద్రంలోని నోడల్ అధికారి కార్యాలయంలో జీజేఎల్ఏ 475 యూనియన్ ఆధ్వర్యంలో నోడల్ ఆఫీసర్ శంకర్ నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ అవార్డులు పనితీరును మరింత నాణ్యమైనవిగా చేస్తాయన్నారు. ఉద్యోగిపై బాధ్యతను కూడా పెంచుతాయని తెలిపారు. తన సహచర ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకుడు ఉత్తమ అవార్డు పొందడం సంతోషంగా ఉందన్నారు. సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కళాశాలలో ప్రిన్సిపల్ అధ్యాపకులకు అందుబాటులో ఉంటూ అనేక సేవలు అందిస్తున్నారని అన్నారు. జైనూర్ ప్రిన్సిపాల్ శ్రీదేవి మరింత ఉత్తమ సేవలు అందించి అవార్డు పొందడం జిల్లాకే గర్వకారణం అని కొనియాడారు. ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు పొందిన చంద్రయ్య సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ఉత్తమ అవార్డు గ్రహీతలను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు రాందాస్, సంపత్ కుమార్, అధ్యాపకులు నాయిని శ్రీనివాస్, నవీన్ రెడ్డి, బాలకిషన్, సునీల్, సంజీవ్, సంతోష్, సరిత, ప్రభాకర్, హరిదాస్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రదం సోపాన్ క్యాంపును బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ డి రవిప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఏడు సింగరేణి పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈ శిబిరం నిర్వహించనున్నామని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం రవిప్రసాద్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పథకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని అన్ని విభాగాల్లో నైపుణ్యం సంపాదించాలన్నారు. సేవా, దేశభక్తి, క్రమశిక్షణ పెంచుకొనేందుకు కౌట్స్ అండ్ గైడ్స్ మంచి వేదికన్నారు. గోలేటి పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్రపతి అవార్డు, 12 మంది గవర్నర్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జీఎం రవిప్రసాద్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సీనియర్ అయిన జూనియర్ ఇన్స్‌పెక్టర్ చంద్రయ్యను సన్మానించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ప్రధానోపాధ్యాయులు సంతోష్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, భాస్కర్, సృజన పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ దీక్ష ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 40 మంది భక్తులు 41 రోజులపాటు మండల దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శిరీష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం చేశారు. దీక్ష సమయంలో తీసుకోవాల్సిన నియమనిబంధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వివేక్, రమేష్, వెంకన్న, శ్రీనివాస్, మధు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

జ్ఞానబోధ యాత్ర ద్వారా సీఎంకు జ్ఞాన ఇరుముడి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

జ్ఞానబోధ యాత్ర ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి జ్ఞాన ఇరుముడిని సమర్పిస్తున్నట్టు టీఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ అన్నారు. ముఖ్యమంత్రి మహాత్మా జ్యోతిబాపులే ప్రజాభవనం హైదరాబాద్ వరకు 370 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అవసరమైన జ్ఞాన ఇరుముడి తలపై మోసుకొని వెళ్లి ముఖ్యమంత్రికి అందించడం జరుగుతుందని తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం బాబుజగ్జీవన్‌రావ్ భవనం ప్రారంభోత్సవం సందర్భంలో మాట్లాడుతూ దళిత పేదవర్గాల ఆత్మగౌరవం, హక్కులు, కుల నిర్మూల, విద్యాజ్ఞాన సంపద, దళిత, పేద వర్గాలను కోటీశ్వరులను చేస్తాయని, కుల మతాలకు సంబంధం లేకుండా ప్రభుత్వాలు ఒక సంపూర్ణంగా విద్యనందించినప్పుడే దళిత, పేద వర్గాలు అభివృద్ధి చెందుతారన్నారు. సమీకృత పాఠశాలలను ఏర్పాటుచేయడం, కుల మతాలకు అతీతంగా పరస్పర సహకారం పొంది కుల నిర్మూల జరుగుతుందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రితో అది సాధ్యమవుతుందనే ఉద్దేశ్యంతో ఈ పాదయాత్ర నిర్వహించి ముఖ్యమంత్రికి జ్ఞాన ఇరుముడి పెన్‌డ్రైవ్, ముఖ్యమంత్రి ఫోటో ఫ్రేమ్‌ను జ్ఞాపికగా అందిస్తామన్నారు. ఈ పాదయాత్రలో జిల్లా కన్వీనర్ చంద్రగిరి రవీందర్, నక్క శ్రీనివాస్, టేకం హనుమంతు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

నవతెలంగాణ-జైనూర్

క్రీడల్లో గెలుపోటములు సహజమని జామిని గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మెస్రం రాహుల్ అన్నారు. మంగళవారం మండలంలోని జామిని గ్రామంలో నిర్వహించిన చివరి పోటీలో మార్లావాయి గ్రామ జట్టు విజయం సాధించింది. రెండవ బహుమతి మాన్కపూర్ గ్రామ జట్టు గామానికి చెందిన యువత విజయం సాధించారు. మొదటి బహుమతి మార్లావాయి గ్రామానికి చెందిన జట్టుకు రూ.20 వేలు, రెండవ బహుమతి మాన్కపూర్ గ్రామ జట్టు రూ.10 వేలు బహుమతి అందజేశారు. గెలుపోటముల్లో ఎలాంటి పక్షపాతం లేకుండా స్నేహాభావంతో క్రీడలు ఆడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సతీష్ పాల్గొన్నారు.

గోలేటి నుండి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటి నుండి హైదరాబాద్‌కు ఆర్‌టీసీ బస్సు సౌకర్యం ప్రారంభమైందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ డి.రవిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనరల్ మేనేజర్ రవిప్రసాద్ విజ్ఞప్తి మేరకు ఆసిఫాబాద్ డిపో మేనేజర్ ఈ బస్సు సౌకర్యం కల్పించారని ఆయన తెలిపారు. బస్సు ఉదయం 5:45 గంటలకు ఒక ఎక్స్‌ప్రెస్ సర్వీసు వయా గోలేటి మీదుగా హైదరాబాద్ వెళ్తుంది. రాత్రి 22 :45 ఒక హైటెక్ సర్వీసు గోలేటి మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుంది. హైదరాబాద్ నుంచి గోలేటికి రాత్రి 21 : 30 నిమిషాలకు కొత్త సూపర్ లగ్జరీ సర్వీసులను ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. గోలేటి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

రక్త శుద్ధి కేంద్రంలో జనరేటర్ సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త శుద్ధి కేంద్రంలో వెంటనే జనరేటర్ సౌకర్యం కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తిక్ తో కలిసి రక్తశుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్త శుద్ధి కేంద్రంలో నిత్యం సుమారుగా 20 మంది రోగులు రక్త శుద్ధి చికిత్స పొందుతున్నారన్నారు. రోగులకు విద్యుత్ ఆగిపోయినప్పుడు రక్తం అందడం లేదని, అధికారుల సమన్వయ లోపంతో పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోట్లాది రూపాయలతో ఆసుపత్రిలో సౌకర్యాలపై దృష్టి పెట్టిన అధికారులు జనరేటర్ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే జనరేటర్ సౌకర్యం కల్పించడంతోపాటు దాని నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. లేనట్లయితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి హామీలో ఈకేవైసీ తప్పనిసరి



నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండలంలోని రవీంద్రనగర్ 1,2 రణవెల్లి గ్రామ పంచాయతీలోని జాజులగూడ గ్రామాలలో ఉపాధి హామీ పనులో భాగంగా రూ.9.94లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులను మంగళవారం ఎంపీడీవో ప్రసాద్, ఏపీఓ గోవర్ధన్‌సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీగా పని చేయాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. నిర్ణయించిన పనిని పూర్తి చేస్తే ప్రతి రోజు రూ.270 చెల్లిస్తామన్నారు. వీరితో పాటు కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

గోలేటి నుండి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గోలేటి నుండి నూతనంగా హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అభ్యర్థన మేరకు రెండు సర్వీసులను గోలేటి నుండి హైదరాబాద్ నడపనున్నట్లు తెలిపారు. ఉదయం 5:45నిమిషాలకు ఎక్స్‌ప్రెస్, రాత్రి 10:45కు హైటెక్ సర్వీస్ గోలేటి మీదుగా వెళుతుందని తెలిపారు. అలాగే తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ నుండి రాత్రి 9:30కు గోలేటికి ప్రత్యేక సర్వీస్ ఉంటుందన్నారు. గోలేటి పరిసర ప్రాంత ప్రజలు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని, ప్రయాణికుల రద్దీ అనుగుణంగా అవసరమైతే మరిన్ని సర్వీసులు వేస్తామని తెలిపారు.

విద్యతోనే ఉత్తమ పౌరుల తయారీ



వతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయడం ద్వారానే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని జిల్లా విద్యాశాఖ అధికారి పార్మి అశోక్ అన్నారు. సార్సాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఈఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సమాధానాలకు డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన సామాగ్రిని పరిశీలించారు. గదిలో ఏర్పాటు చేసిన సైన్స్ కార్నర్, గణిత కార్నర్‌లను పరిశీలించారు. డీఈఓ వెంట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ కటుకం మధుకర్, ఉప్పలేటి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. మంగళవారం కమిషనర్ భుజంగరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సులబ్ కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. అలాగే ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ స్థలం లేక వాహనాలకు నిత్యం పోలీసులు అపరాధ రుసుములు విధిస్తున్నారని, వెంటనే పార్కింగ్ స్థలం కేటాయించాలన్నారు. జిల్లా కేంద్రంలో నాసిరకమైన తినుబండారాలు అమ్మే దుకాణాలు అధికమయ్యాయని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్వీట్ హౌస్‌లు ఇతర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.



అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కుర్చీల పంపిణీ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణ పరిధిలోని వెంకటాపూర్, ఎమ్మెల్యే కాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కుర్చీలను పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమం కింద పాఠశాలలకు కావాల్సిన కనీస సౌకర్యాల కల్పనలో భాగంగా సోషల్ రెస్పాన్సిబిలిటీ(సిస్సార్) అటవీ అభివద్ధి సంస్థ వారు తమ వంతుగా ఈ కార్యక్రమం చేపట్టామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ మంచిర్యాల రేంజ్ మేనేజర్-1 జి.సురేష్ కుమార్, రేంజ్-2 ఇ.లక్ష్మణ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అటవీఅభివృద్ధి సంస్థ సూపర్ వైజర్ శ్రీనివాస్, వాచర్‌లు, సిబ్బంది శంకర్, సాయికిరణ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికలను మంగళవారం మంచిర్యాలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికలలో 113 మంది సభ్యుల గాను 110 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో అత్యధికంగా ఓట్ల మెజారిటీ గెలిచిన సభ్యులు ఖంపెల్లి చిన్నయ్య, అరుగుల వెంకటేశం, ఉట్నూరి నిత్యశ్రీ, కందుల శ్రీనివాస్, శాఖపురం శంకరయ్య, కల్లెడ నరసయ్య, శాఖ పురం లచ్చయ్య, కూనరపు ప్రభాకర్, శివర్ల మల్లేష్, తుటి శ్రీనివాస్, చేతి బాలరాజులు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారని ఎన్నికల స్పెషల్ జిల్లా సహాయక కార్యదర్శి జై నర్సయ్య తెలిపారు. అనంతరం వీరిలో సంఘ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల పదవులకు ఎన్నిక చేయడం జరుగుతుందని తెలిపారు.

అంగన్‌వాడీల్లో పోషణ పక్ష కార్యక్రమం



నవతెలంగాణ-హాజీపూర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్ ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోనీ కొత్తగుడిసెలు-1 అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ రమాదేవి గర్భిణులకు అవగాహన కల్పించారు. ప్రెగ్నెన్సీ రిజిస్ట్రేషన్, చిరుధాన్యాలు వాడడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీచర్ తిరుమల, సహాయకురాలు కవిత పాల్గొన్నారు.

మాజీ సింగిల్ విండో చైర్మన్‌కు పరామర్శ



నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తపాలపూర్ మాజీ ఎంపీటీసీ, సింగిల్ విండో మాజీ చైర్మన్ కమ్మల సత్యనారాయణను తెలంగాణ రాష్ట్ర మాజీ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి. చంద్రయ్య మంగళవారం హైదరాబాదులో పరామర్శించారు. సత్యనారాయణ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ, యశోద ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న సందర్భంగా, వారిని కలిశారు. మంచి ఆహారం తీసుకోవాలని రోజు వ్యాయామం చేయాలని, ఆరోగ్యంపై అశ్రద్ధ వహించకూడదని సత్యనారాయణ సూచించారు.

కనీస సౌకర్యాల కల్పనకు కృషి

- ప్లాంటేషన్ మేనేజర్ సురేష్

నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం కనీస సౌకర్యాలు కల్పనకు తమ వంతుగా అటవీ అభివృద్ధి సంస్థ కృషి ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ అన్నారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా మంగళవారం షట్‌పల్లి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుర్చీలు అందజేసినట్లు తెలిపారు.కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా అతని అభివృద్ధి సంస్థ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ సురేష్‌తో పాటు మంచిర్యాల రేంజ్-2 ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధిక, అడవి అభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

హస్త కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

- జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్

నవతెలంగాణ-జన్నారం

చేతివృత్తుల కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని జడ్పీటీసీ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం వెదురు బొంగుతో తయారుచేసిన నెమలిని హస్త కళాకారుడు సంద గోపాల్ ఆయనకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరగడంతో హస్తకళ అంతరించిపోతుందన్నారు. హస్తకాలను నమ్ముకొని జీవిస్తున్న, వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. వారికి ప్రభుత్వం, ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణ సౌకర్యం కల్పించి, వడ్డీ లేని రుణాలు అందించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. హస్తకాలను బ్రతికించాలని కోరారు.

దేవాపూర్‌లో ఓరియంట్ కంపెనీ అభివృద్ధి



నవతెలంగాణ-కాసిపేట

దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ప్రెసిడెంట్ సత్యబ్రత శర్మ యూనిట్ హెడ్ శ్రీ మహేంద్ర ప్రతాప్ జోషి అద్వర్యంలో ఓరియంట్ కంపెనీ యాజమాన్యంతో రూ.1.55 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పరిసర గ్రామాలైన తుడుంగూడెం, సాలెగూడెం, రేగుల గూడెం, ఇప్పల గూడెం, గట్రావ్ పల్లి గ్రామాల్లో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తుడుంగూడెంలో సీసీ రోడ్లు, కల్వర్ట్, నీటి బోర్ పంపు, సాలెగూడెంలో కమ్యూనిటీ హాల్, నీటి బోర్ పంపు, రేగులగూడెంలో సీసీ రోడ్డు, నీటి బోర్ పంపు, ఇప్పలగూడెంలో సీసీ రోడ్డు, గట్రావ్‌పల్లిలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ పనులు చేపట్టి గ్రామాల్లో సమస్యలు పరిష్కారం చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రెస్‌క్లబ్ రీడింగ్ రూమ్‌కు భూమి పూజ

నవతెలంగాణ-జన్నారం

మండలంలో ప్రెస్ క్లబ్ భవనంలో రీడింగ్ రూమ్ అదనపుగదికి మంగళవారం ఎంపీడీఓ శశికళ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నరసయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ నిధుల నుంచి రూ.4 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలో భవనాన్నిపూర్తి చేస్తామన్నారు. పీవోపీ ఆర్డీ రమేష్, జేఈ సతీష్ ఈఓ రాహుల్, ఏపీఓ రవీందర్, ప్రెస్ క్లబ్ సభ్యులు, మందపల్లి కాంతయ్య మల్లేశం, లింగన్న జాడి వెంకటయ్య పవన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-నస్పూర్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్, సీసీ కెమెరాలు పెట్టాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వరకు అంగన్‌వాడీ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించి కలెక్టర్ సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అంగన్‌వాడీ ఉద్యోగుల పట్ల చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరించేటువంటి ఆలోచన విధానాన్ని విరమించుకోవాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా ముఖ్యమంత్రి ఇలా మాట్లాడడం అనేది సరైది కాదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ ఆలోచించి అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, రిటర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇతర సౌకర్యాలు కల్పించకుండా ఆన్‌లైన్ యాప్‌ల పేరుతో అంగన్‌వాడీ ఉద్యోగులపైన పని భారంతో వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. వేసవికాలం సెలవులు ప్రభుత్వ పాఠశాల పిల్లలకేనా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకి వర్తించవా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత 30 ఏళ్ల కిందట కట్టినటువంటి అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిగా శిథిలవస్తులో చేరాయని, ఇప్పుడు అదే కేంద్రాల్లో పిల్లలని ఉంచుతూ పాఠశాల నడిపించడం అంటే చాలా భయంగా ఉందని, కాబట్టి శిథిలావస్థలో ఉన్న భవనలకు సొంత భావనలను నిర్మించాలన్నారు. ప్రభుత్వం నిర్వహించేటువంటి ఒంటి పూటబడలు ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడులు, మే నెలలో పూర్తిగా అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు సెలవులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసేటటువంటి సరుకులు నాణ్యతగా సమయానికి కేంద్రాలకు చేర్చడంలో కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తున్నారని, నాణ్యత వస్తువులు సరుకులు కేంద్రాలకు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. గతంలో పదో తరగతి అర్హతతో అంగన్‌వాడీ హెల్పర్లకు టీచర్లుగా ప్రమోషన్ ఇచ్చే వాళ్ళు కానీ, ఇప్పుడు ప్రభుత్వం దీన్ని ఇంటర్మీడియట్‌కు పొడిగించడం సరైనది కాదని అన్నారు. దీనివల్ల వేలాది మంది అర్హత ఉన్నటువంటి అంగన్‌వాడీ హెల్పర్లు నష్టపోతున్నారని, పదవ తరగతి ఉత్తీర్ణత తోటి అంగన్‌వాడీ హెల్పర్ల ప్రమోషన్లు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీల పట్ల ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరైనది కాదని, ముందుగా కేంద్రంలో పెట్టాల్సింది సీసీ కెమెరాలు, బయోమెట్రీకులు కాదని, ఉద్యోగ భద్రత, కనీస వేతనం చెల్లించాలన్నారు.



క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ యాజమాన్యం ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివారణ చర్యలకు సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, సేవ అధ్యక్షురాలు రాధా కుమారి పాల్గొని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో శ్రీరాంపూర్ ఏరియా వైద్య అధికారులు వైద్య సిబ్బంది ఎల్లవేళలా కృషి చేస్తున్నారని, అందులో భాగంగా ఈ అవగాహన వ్యాధి నిర్ధారణ పరీక్షల సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటే సంస్థ అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగులందరూ తమ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ ఉండాలని, మందులను వాడాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అనేది ముఖ్యమని, వ్యాధి నిర్ధారణ చేసుకుని దానికి సంబంధిత మందులను వాడాలని తెలిపారు. ఏసీఎంఓ డాక్టర్ ఉష, జనరల్ సర్జన్ డాక్టర్ వి శ్రీకాంత్, గైనకాలజిస్ట్ డాక్టర్ జి హరిత, డాక్టర్ లోకనాథ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ వ్యాధులకు సంబంధించిన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, ఎస్ఓ టు జీఎం వి పురుషోత్తమ రెడ్డి, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీవై సీఎంఓ డా.రమేష్ బాబు, బెల్లంపల్లి డీవై సీఎంఓ డా.శౌరి, డా.మురళీధర్, సీనియర్ పీఓ పి కాంతారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో బాధ్యత వహించాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి ఉద్యోగుల జీతాలు, సమస్యలు పరిష్కరించడంలో ప్రతి ఒక్కరు బాధ్యత వ్యవహరించాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు అన్నారు. మంగళవారం ఆయన అధ్యక్షతన ఏరియా పర్సనల్ డిపార్ట్మెంట్‌కు సంబంధించిన అధికారులు, అన్ని గనుల సంక్షేమ అధికారులు, పిఓఏలు, ఆయా గనుల, డిపార్ట్మెంట్ల మినిస్ట్రీరియల్ స్టాఫ్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద రావు మాట్లాడుతూ ఉద్యోగుల జీతభత్యాలు చెల్లింపు ప్రక్రియలో సంబంధిత సమస్యల పరిష్కరించడంలో, అర్హత గల ఉద్యోగుల ప్రమోషన్ పాలసీల అమలుకు పాటించవలసిన నియమ నిబంధనలు తెలియజేస్తూ నిర్ణీత కాలవ్యవధిలో ఉద్యోగులకు సంబంధించిన టైం బౌండ్, క్యాడర్ స్కీములు ప్రమోషన్లు పాలసీలు బదిలీల పద్ధతుల గురించి సమీక్షించారు. సమర్థవంతంగా నిర్వహణకై, ఉద్యోగుల ఇతర సమస్యల సత్వర పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం బెనిఫిట్స్ సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యూటీ సంబంధిత ఉద్యోగుల నుంచి తగిన డాక్యుమెంట్స్ తీసుకుని వాటిని సకాలంలో అందజేయాలనీ, అలాగే మార్చి 31లోగా జీరో పెండింగ్ ఫైల్స్ లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గైర్హాజరైన ఉద్యోగులకు కౌన్సిలింగ్ కూడా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో డీవై పీఎంలు రాజేశ్వరరావు, రాజేష్, దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సీనియర్ పీఓలు పి కాంతారావు, సునీల్, గౌస్ పాషా, రణదీప్ గౌడ్, సంతస్, పాల్ సృజన్, అజ్మీర రమేష్ పాల్గొన్నారు.

మహిళగా పుట్టినందుకు గర్వపడాలి



నవతెలంగాణ-జైపూర్

ఒక మహిళగా పుట్టినందుకు మనమంతా గర్వపడాలని ఎస్టీపీపీ ఈడీ సతీమణి, సేవా సమితి అధ్యక్షురాలు భవాని బసివిరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్టీపీపీ టౌన్ షిప్‌లో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రామిక మహిళగా మొదలై అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా అవతరించిందని అన్నారు. ఐక్య రాజ్య సమితి ఈ సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా ఇన్వెస్ట్ ఇన్ ఉమెన్ ఆక్సిలరేట్ ద ప్రోగ్రెస్ అనే థీమ్‌తో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. మహిళల ప్రగతే సమాజాభివృద్ధి అనే స్వామి వివేకానంద సూక్తిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్రవంతి వేణుగోపాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, మహిళా సాధికారత కోసం సింగరేణి సేవా సమితి ద్వార ప్లాంట్ ప్రభావిత గ్రామ ప్రజలకు వృత్తి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. అమ్మను పూజిద్దాం..భార్యని ప్రేమిద్దాం..సోదరిని ఆశీర్వదిద్దాం.. స్త్రీలను గౌరవిద్దామని ఎస్టీపీపీ ఈడీ బసివిరెడ్డి ఈ సంధర్భంగా పేర్కొన్నారు. నీరు దాని ప్రాముఖ్యత, ఆరోగ్యమే మహాభాగ్యం అనే కర పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం బ్యూటీషియన్, టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన బాంబ్ ఇన్ దా సిటీ, పాసింగ్ ద బాల్, లక్కీ లేడి తదితర ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగీత జెఎస్ సింగ్, లలిత కుమారి, రామ శాస్త్రీ, పుష్పలత శ్రీనివాస్ పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- సీనియర్ సైంటిస్ట్ సుచరిత



నవతెలంగాణ-తాండూర్

సరైన సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే మామిడిలో అధిక దిగుబడులు పొందవచ్చని సీనియర్ సైంటిస్ట్ సుచరిత సూచించారు. మంగళవారం కన్నాల రైతు వేదికలో ఆన్‌లైన్ ద్వారా రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మార్చి మాసంలో మామిడి పంటలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ వ్యవసాయ అధికారి కిరణ్మయి రైతులు పాల్గొన్నారు. ప్రస్తుతం మామిడిలో తేనె మంచు పురుగు ఆశించే అవకాశాలు ఉన్నాయన్నారు. నివారణకు లీటర్ నీటికి ఫాస్ఫామిడాన్ 5 మి.లీ 10 లీటర్ల నీటిలో లేదా ప్రొఫినోఫాస్ 1.5 మి.లీ. ఒక లీటర్ నీటిలో లేదా క్లోరోఫిరిఫాస్ 2.5 మి.లీ ఒక లీటర్ నీటిలో కలిపి పిందేలు తయారైయ్యే సమయంలో ఆకుల పైననే కాకుండా మొదల్ల పైన కొమ్మల పైన కూడ పిచికారి చేయాలని తెలిపారు. థయోమిథాక్సామ్ 0.3 గ్రాములు 1 లీటర్ నీటికి కలిపి పిచికారి చేయుట వలన పూత, కాపు సమయంలో తేనె మంచు పురుగును సమర్థవంతంగా నివారించవచ్చున్నారు. మామిడి పిందె నుండి నిమ్మ కాయ సైజు మధ్యలో ఉన్నప్పుడు 25-30 రోజుల కోసారి తేలికపాటి తడులివ్వటం ద్వారా పిందె రాలడం నివారించవచ్చని సూచించారు. ప్లానోఫిక్స్ అనే హార్మోన్ 1 మి.లీ 4.5 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయటం ద్వారా పూత, పిందె రాలకుండ నివారించవచ్చని తెలిపారు. గోలి కాయ సైజులో ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ (మల్టీ కే) 10 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయటం వలన కాయ నాణ్యత బరువు పెరుగుతుందని తెలిపారు. డ్రిప్ సౌకర్యం ఉన్న రైతులు నీటి తడులతో పాటు యూరియా పొటాషియం పెరుగులను అందించాలని సూచించారు.

సదస్సుకు వెళ్లిన ఐకేపీ సిబ్బంది



జన్నారంలో

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మహిళా సదస్సుకు మండల ఐకేపీ సిబ్బంది మంగళవారం బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహిళా సదస్సుకు మెప్మా ఈడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి మహిళల కోసం ఆరు గ్యారెంటీలలో సగం కంటే ఎక్కువ మహిళల కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఆర్థికంగా బలపడాలన్న ఉద్దేశంతో జీరో వడ్డీతో రూ.10 లక్షల వరకు రుణాలతో పాటు, ఐదు లక్షలు జీవిత బీమా అందించే కొత్త పథకం ప్రారంభించడం జరిగింది. మహిళా పురోగతికి ఎంత తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ మహిళా సంఘం నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: హైదరాబాద్లోని పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మహిళా సదస్సుకు మండల ఐకేపీ మహిళలు, మంగళవారం ఉదయం భారీగా తరలి వెళ్లారు. సందర్భంగా ఐకేపీ ఏపీఎం బుచ్చన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు, ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని వారు తెలిపారు. వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మహిళా సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఐకేపీ మహిళలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారన్నారు.

విలేకరిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్

నవతెలంగాణ-హాజీపూర్

చెన్నూరుకు చెందిన దళిత విలేకరి వెంకటరాజుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్ రాజంను పరామర్శించారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ చెన్నూరు నుంచి సిర్వొంచకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని వార్త తన పత్రికలో ప్రచురించినందుకు కొంతమంది గుర్తు తెలియని దుండగులు మార్చి 11 న రాత్రి సమయంలో వెంకటరాజుపైన దాడి చేసి ఎక్కడపడితే అక్కడ పిడుగులు గుద్ది కంటిపై కొట్టడంతో గాయాలయ్యాయని తెలిపారు. దాడి చేసిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి వైద్య ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్ధార్థ రామ్మూర్తి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండల ఆర్ఎంపీ అసోసియేషన్ కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎం సారంగపాణి, అధ్యక్షులుగా టీ ప్రకాష్ రావు(మురిమడుగు), ఉపాధ్యక్షులుగా వాసాల శ్రీనివాస్(కిష్టాపూర్), టార్ఫ్ ఖాన్(కవ్వాల), ఖరీం (కలమడుగు), కె.రాజన్న(చింతగూడ), కే నవీన్(కలమడుగు), ప్రధాన కార్యదర్శిజి పి.రాజు(రేండ్లగూడ), సహాయ కార్యదర్శ సురేష్(చింతగూడ), కార్యదర్శి బ్రాహ్మచారి(దేవునిగూడ), కార్యదర్శి పి.సతీష్(చింతగూడ) కోశాధికారి అంజన్న(బాధంపల్లి), సలహాదారులు వి.వెంకటేశ్వరగౌడ్(ధర్మారం), భీమయ్య(కవ్వాల్) యాజాజోద్దీన్(కవ్వాల్), రామస్వామి(కలమడుగు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | మార్చి 13, 2024 | www.navatelangana.com

మండలంలో పర్యటించిన ఎంపీడీఓ

నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పెద్ద మాలేబోరిగామ, చించుఘాట్ గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పర్యటించారు. నర్సరీలు, తాగునీటి సమస్య, శానిటేషన్, ప్లాంటేషన్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శులు అశోక్, దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాగ్రి అందజేత

నవతెలంగాణ- ఉట్నూర్



మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచన మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అబ్దుల్‌మాబుద్‌ఖాన్ పరీక్ష సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ, అహ్మదుల్ల, అఖిల్, మతీన్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



నవతెలంగాణ - తాంసి

వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మండలంలోని ఏ గ్రామాల్లో కూడా నీటి సమస్య లేకుండా చూసుకోవాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా ఆయన మాట్లాడుతూ వచ్చే రెండు మూడు నెలలు మండలంలోని ఏ గ్రామాల్లో కూడా నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని చేతి పంపులు మిషన్ భగీరథ నీటి సరఫరా ప్రతిరోజు అయ్యేటట్లు చూసుకోవాలని సూచించారు. చేతి పంపులు చెడిపోయినట్లయితే ఎప్పటికప్పుడు వాటి మరమ్మత్తులు చేయించుకోవాలి అన్నారు. గ్రామాల నుండి ఇటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకునే బాధ్యత స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీఓ స్వప్న శీలా, పంచాయతీ కార్యదర్శులు, ఇంచార్జ్ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు



నవతెలంగాణ- కుభీర్

మండలంలోని ఫార్డి- బి గ్రామంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గత ఐదు రోజుల నుంచి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి ఆలయం పక్కన ఉన్న కాళీ స్థలంలో కుస్తీ పోటీలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.8వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.5వేలు అందించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మహారాష్ట్రలోని పలు ప్రాంతాలతో పాటు జిల్లా చుట్టుపక్కల నుంచి మల్లయోధులు హాజరయ్యారు. ఈ పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.మోహన్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, రాజు,ప్రవీణ్‌బాబు, శేరి సురేష్, పంచాయతీ కార్యదర్శి కమల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

హైదరాబాదులో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ పైన ఉచిత శిక్షణ ఉద్యోగ కల్పనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసి శాఖ అభివృద్ధి అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పాసైన అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా హైదరాబాద్ లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో రెండు నెలల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తయిన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్ మెంట్ ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్ 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు ఈనెల 15 నుండి 25 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌ను ఈనెల 31న ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ లో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని మరింత సమాచారం కొరకు 08732221280 ని సంప్రదించాలని సూచించారు.

మెటీరియల్ కొరకు

ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ అభ్యర్థులకు టీచర్స్ (ఎస్జీటీ, స్కూల్‌అసిస్టెంట్) రిక్రూట్మెంట్ 2024 (పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకున్న 10,000 మంది బీసీ అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ ఖర్చును అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా మార్చ్ 14 నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.స్కూల్ అసిస్టెంట్ కు సంబంధించి గ్రాడ్యుయేషన్, బీఎడ్, టెట్, ఎస్జీటీలకు సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08732221280, 9949684959 నంబర్ లను సంప్రదించాలని సూచించారు.

పుట్టిన రోజున ఆలయానికి రూ.లక్ష విరాళం

నవతెలంగాణ- ఆదిలాబాద్ టౌన్

జిల్లా కేంద్రానికి చెందిన రాళ్లబండి మహేందర్ తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం శంకర్ గుట్టలోని ఆంజనేయ స్వామి దేవస్థానానికి రూ.లక్ష విరాళం అందించి తన భక్తిని చాటారు. అందరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని, అదే ఆనంద కర జీవితమని పేర్కొన్నారు. అలాగే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఇదివరకు చాలానే చేసినట్లు గుర్తుచేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేసి విరాళాన్ని అందించినందుకు ఆలయ కమిటీ సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమా గౌడ్, సంజీవ్, మల్లేశ్, పిట్ల ఓం ప్రకాష్, సుదర్శన్, రమేష్, అభిలాష్, శేఖర్, భూమేష్ రెడ్డి, అభిరామ్, అశోక్ ఉన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ- నిర్మల్



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల్లో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తున్నారని అన్నారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ముఖ్యమైనదని, జిల్లా ఎస్పీగా మహిళ ఉండటం గొప్ప విషయమని తెలిపారు. ఓటు హక్కు కల్పించిన తర్వాత మహిళల పురోగతి ప్రారంభం అయ్యిందని, మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై అందరూ కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లు అని అంబేద్కర్ మాటలను గుర్తుచేశారు. మహిళలను గౌరవించాలని, మహిళాసాధికారతకు ప్రతిఒక్కరు కృషిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలతో కేకును కట్ చేయించారు. అనంతరం పోషణ పక్షం పోస్టర్ ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెలలో స్వీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, మెహిందీ పోటీలలో గెలుపొందిన మహిళలను సన్మానించి, బహుమతులు అందజేశారు. అంతకుముందు వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీ.డబ్ల్యూ.వో రమేష్, సిపిఓ మల్లికార్జున్, ఎల్‌డీఎం చంద్రశేఖర్, సీడీపీవో లు, అధికారులు, మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వసతిగృహ సంక్షేమ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వమించారు. ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తాతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటిని మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేయాలని, ఆర్వో ప్లాంట్స్ మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని సూచించారు. ఎక్కడా కూడా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యం పై ఆరా తీయాలని, ప్రతి గురువారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు ఫీల్డ్ విసిట్ చేయాలని, అనారోగ్యం, ఎనీమియాతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యం అందించాలని అన్నారు. ప్రతి మొదటి గురువారం ఒక స్కూల్‌లో పర్యటించి మినిమం విద్యార్థులను పరీక్షించి మిగిలిన విద్యార్థులను మరుసటి గురువారం పరీక్షించాలని తెలిపారు. షెడ్యూల్ తయారు చేసుకొని ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం క్యాంపులు నిర్వహించి ఆరోగ్య కార్డులు అందించాలని అన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ సూచించారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా సరఫరా చేస్తున్న బలవర్ధకమైన బియ్యాన్ని వృథా కాకుండా పదిహేను నిమిషాలు బియ్యం నానబెట్టడం వల్ల పైన తేలుతున్న బియ్యం కలసి పోతాయని దీనివల్ల మంచి పోషకాలు అందుతాయని అవగాహన కల్పించారు. సివిల్ సప్లై శాఖ నుంచి స్కూల్‌లో శిక్షణ ఇవ్వాలని ఇందులో అందరూ పాల్గొనేలా చూడాలని అన్నారు. ప్రతి హాస్టల్‌లో తాగునీరు, ఆరోగ్యం, ఆహారం విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని నాణ్యమైన సరకులు అందించాలని తెలిపారు. పెండింగ్ పనులకు మరమ్మత్తులు లాంటివి ఏమైన ఉంటే ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు.

అందరం కలిసి కట్టుగా పార్టీ గెలుపునకు కృషి చేద్దాం

నవతెలంగాణ-జైనథ్



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు మనమంతా శాయ శక్తులా కృషి చేయాలని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, ఆదిలాబాద్ పార్లమెంట్ ఆశావహ అభ్యర్థి అజ్మీరా రేఖానాయక్ పిలుపునిచ్చారు. అందరం ఒక్కతాటిపై నిలబడి కష్టపడి పని చేసి ఆదిలాబాద్ లోక్ సభ గడ్డ మీద కాంగ్రెస్ జెండాని ఎగురవేయాలని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పర్యటించిన ఆమె మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం అదృష్టమన్నారు.కాంగ్రెస్ పార్టీ ఒక సముద్రమని ఎంత మంది వచ్చినా కలుపుకుంటుందని పేర్కొన్నారు. లోక్‌సభ సీటు గెలవాలంటే అంతా కలిసికట్టుగా ఒక్కటై కష్టపడాలని అప్పుడే విజయం వరిస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఆశావహ అభ్యర్థులు పార్టీలో చాలా మందే ఉన్నారని అనుభవం కూడా ఉంటేనే ఎన్నికల్లో గెలవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. తాను గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ తెలంగాణ ఉద్యమ సమయంలో స్థానిక ప్రజల ఒత్తిడి మేరకు బీఆర్ఎస్ లో చేరానని అన్నారు. గతంలో ఒక ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రిని కలవాలంటే ఐదారు గంటలు వేచి ఉంటే కాని సాధ్యపడేది కాదని అక్కడ ఊపిరి తీసుకోవాలంటే కూడా భయపడే పరిస్థితి ఉండేదన్నారు. తాను తన నియోజక వర్గం కోసం కొట్లాడి నిధులు సాధించుకొని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఒక రకంగా బీఆర్ఎస్ హైకమాండ్ తనకు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో టికెట్ ఇవ్వందే మంచిదైందని తాను తన సొంత గూటికి చేరుకునే అవకాశం దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని తిరిగి పార్టీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. తనకు టికెట్ ఇస్తే మీ అందరి సహకారంతో ఎంపీగా కూడా గెలుస్తానన్నారు. అంతకు ముందు స్థానికంగా ఉన్న సుప్రసిద్ధ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్,గ్రామ ఎంపీటీసీ కోడిచర్ల సుదర్శన్,లక్ష్మీపూర్ గ్రామ ఎంపీటీసీ కామ్రే మనోజ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మునిగెల విఠల్ పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం కావాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, ప్రత్యేక కలెక్టర్ డి.చంద్రకళతో కలిసి వీడియో, ఫ్లయింగ్, స్టాటిక్ సర్వేయలెన్స్ బృందాలు, వీడియో విజిలెన్స్ బృందాలు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈఈఎం (ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ)లో ఖర్చుల పరిశీలకులు, సహాయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్-స్టాటిక్ సర్వేయలెన్స్ బృందాలు, వీడియో సర్వేలైన్స్ బృందాలు, అకౌంటింగ్ బృందం, ఎక్సైజ్ బృందం, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీల ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 3 కంటే ఎక్కువగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విధులు నిర్వహించడం జరుగుతుందని, నియోజకవర్గంలో జరిగే అంశాలను తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై స్పందించాలని, మద్యం, నగదు, కానుక పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రాజకీయ పార్టీలకు సంబంధించి ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కలెక్టరేట్లో 1950 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి 100 నిమిషాలలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పరిధిలో రూ.50 వేల కంటే అధికంగా నగదు తరలించినట్లయితే తనిఖీలలో తగిన ఆధారాలు లేనట్లయితే సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. వీడియో సర్వేయలెన్స్ బృందాలు అనుమతి కలిగిన రాజకీయ పార్టీల సమావేశాలను రికార్డు చేయాలని, సమావేశాల సంబంధిత ఖర్చులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వీడియో చిత్రీకరించే సమయంలో వాయిస్, వీడియో సంబంధిత టైటిల్, తేదీ, ప్రాంతం, పార్టీ వివరాలు, అభ్యర్థి పేరు పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ స్టాటిక్ సర్వేయలెన్స్ బృందాలు, వీడియో సర్వేయలెన్స్ బృందాలు, అకౌంటింగ్ బృందం, ఎక్సైజ్ బృందాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో దొంగతనానికి పాల్పడిన నిందితుని అరెస్టు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సోమవారం అర్ధరాత్రి శివాలయం, వెంకటేశ్వర ఆలయం, కనకదుర్గ మహంకాళి ఆలయాల్లో వరుస దొంగతనానికి పాల్పడిన నిందితున్ని మంగళవారం స్థానిక రవీంద్రఖని రైల్వేస్టేషన్‌లో పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహంకాళి టెంపుల్ కమిటీ అధ్యక్షుడు గిర్నాల రాజ బద్రి ఫిర్యాదు మేరకు ప్రతిరోజు మాదిరిగానే దేవస్థానం అయ్య గారు పూజ చేయుటకు ఉదయం ఆరు గంటల సమయంలో గుడికి వెళ్ళగా గుడి ముందు గల హుండీ తాళం పగలగొట్టి అందులో డబ్బులు గుర్తు తెలియని దుండగులు దొంగలించక పోయారని ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. అలాగే శ్రీ వెంకటేశ్వర, శివాలయం గుడిలో కూడా దొంగలు దొంగతనం చేసినట్లు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై రాజశేఖర్ తన టీంతో దొంగలను సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగను గుర్తించి 24 గంటల్లోపు పట్టుకొని రిమాండ్ తరలించడం జరిగిందని తెలిపారు. నిందితుడు కంది రవి(55) వృత్తి సింగరేణి ఉద్యోగి ఓసీపీ కైరుగుడా, నివాసము గాంధీనగర్ భూపాల్ పల్లిగా గుర్తించారు.

ముగిసిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తాటిగూడలో బెల్లంపల్లి అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. మొత్తం 28 జట్లు పాల్గొనగా హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో బుగ్గ గూడెం జట్టు ప్రథమ స్థానంలో నిలువగా రాంపూర్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.5000, రెండో బహుమతి రూ.3000 అందించారు. ఈ బహుమతులను బెల్లంపల్లి ఎఫ్డీఓ విజయ్ కుమార్, బెల్లంపల్లి రేంజర్ ఏ సుభాష్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, బీట్ ఆఫీసర్లు సురేశ్, కుమారస్వామి, యుగేందర్ పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించకుంటే సేవలు నిలిపేస్తాం

నవతెలంగాణ-తాండూర్

ఇంటి పన్ను చెల్లించకుంటే పంచాయతీ ద్వారా అందించే సేవలు నిలిపి వేస్తామని తాండూర్ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శి తపస్ కుమార్‌తో కలిసి ఇంటి పన్ను వసూలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆఫీసు సమయం కానప్పటికీ సాయంత్రం పూట యజమానులు ఇంటి వద్ద ఉండే సమయంలో ఇంటి ఇంటికి వెళ్లి ఇంటి(ఆస్తి) పన్ను వసూలు చేశారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పన్ను బకాయి సకాలంలో చెల్లించి, గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వం ఇంటి పన్ను వసూలు ఈ నెల 15 వరకు 100 శాతం పూర్తి చేయాలని ప్రభుత్వం కట్ ఆఫ్ డేట్ విధించిందని తెలిపారు. అందువలన ఇంకా ఎవరైనా తమ ఇంటి పన్ను చెల్లించని వారు ఈ నెల 15 తేదీ లోగా పంచాయతీ కార్యదర్శి కి గాని లేదా గ్రామ పంచాయతీ వసూలు సిబ్బందికి గాని చెల్లించి రశీదు పొందాలన్నారు. ఇంటి పన్ను చెల్లించని వారి పై పంచాయతీ రాజ్ చట్టం - 2018 ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి తెలియజేశారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ వసూలు సిబ్బంది వంశీ, రహీం ఉన్నారు.

రైతులు నేరుగా తమ సమస్యలను తెలపొచ్చు

నవతెలంగాణ-బోథ్

రైతులు తమ పంటల సమస్యలను నేరుగా తెలుపొచ్చని ఏడీఏ శ్రీధర్ స్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రైతు నేస్తం కార్యక్రమంలోని వీడియో కాన్ఫరెన్స్ సూచనలు అందించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి మహేష్, ఆయిల్ ఫామ్ మేనేజర్ రామ్మోహన్ రావు, ఏఈఓలు కృష్ణ, శ్యాంసుందర్‌రెడ్డి, కె.శ్యామ్, అర్షజుహి పాల్గొన్నారు.

ఫౌండేషన్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచితంగా అందించే ఫౌండేషన్ కోర్సులను సద్వినియోగం చేసుకుంటూ పోటీ పరీక్షల్లో రాణించాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత కుమారి అన్నారు. స్టడీ సర్కిల్లో శిక్షణ పొందిన జ్యోతి, సుష్మ ఇద్దరు ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో ఏకంగా ఒకరు మూడు ఉద్యోగాలు, మరొకరు నాలుగు ఉద్యోగాలు సాధించారు. కాగా వారిని మంగళవారం ఎస్సీ స్టడీ సర్కిల్లో దళిత అభివృద్ధి అధికారి సునిత, డైరెక్టర్ డాక్టర్ రమేష్ శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా సునీత కుమారి మాట్లాడుతూ 2017, 2019లో జ్యోతి, సుష్మ ఎస్సీ స్టడీ సర్కిల్లో శిక్షణ పొందారని తెలిపారు. ఇటీవల విడుదలైన గురుకులాల ఫలితాల్లో జ్యోతి డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ సాధించగా, సుష్మ జేఎల్, టీజీటీ, పీజీటీ ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. ఇక్కడ అందించే శిక్షణలతో ఎంతో మంది ప్రభుత్వ కొలువులు సాధించారని తెలిపారు. నిరుద్యోగ యువత ఇక్కడి శిక్షణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలో నెలకొన్న సమస్యలను అధికారులు, గ్రామపంచాయతి కార్యదర్శిలు వెంటనే పరిష్కరించి, తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పంద్ర జైవంత్ రావు అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎండ కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నీటి, విద్యుత్ కష్టాలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీలో జాబ్ కార్డ్ లేని వారికి వెంటనే జాబ్‌కార్డు ఇచ్చి ఉపాధి కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ధవులే బాలాజీ ప్యాక్స్ చైర్మెన్ ఎస్పీరెడ్డి, ఎంపీడీఓ మురళీధర శర్మ, అధికారులు గ్రామపంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రారంభమైన రంజాన్ నెలమాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని మసీదులు కొత్త శోభ సంతరించుకున్నాయి. ప్రార్థనలు చేస్తూ భక్తి భావాన్ని చాటారు. సోమవారం రాత్రి నెలవంక దర్శనంతో ఇషా నమాజ్ అనంతరం ముస్లింలు తరావీ నమాజ్ ప్రారంభించారు. ఈ నమాజ్‌లో ఖురాన్ పఠనం ఉంటుంది. రోజు ఉషోదయానికి ముందే ఉపవాసాలు ప్రారంభిస్తారు. సూర్యాస్తమయం కాగానే అల్పాహారంతో దీక్ష విరమిస్తారు. వేసవిలో రంజాన్ ఉపవాస దీక్షలు రావడంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. పండ్ల రసాలు అధికంగా తీసుకుంటే మంచిదని పేర్కొంటున్నారు.